క్లుప్తంగా

సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: స్థానిక సబ్ జైలును శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశమై వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులో భోజన వసతి, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఫిర్యాదుల బాక్స్‌ను పరిశీలించారు. స్వతహాగా న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని పేద రిమాండ్ ఖైదీలకు న్యాయసేవాధికార సంస్థ తరుపున ఉచిత న్యాయసేవలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, న్యాయవాది మాధవస్వామి ఉన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

బేతంచెర్ల: వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల సౌకర్యార్థం పట్టణంలో 3 చోట్ల చలి వేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వార్డు కౌన్సిలర్స్ ఇబ్రహీం, అంజి, కోఆప్షన్ సభ్యుడు ఎల్లయ్యతో కలిసి ప్రారంభించారు. మజ్జిగ పంపిణీ చేశారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని ఆర్టీసీ కోవెలకుంట్ల డిపో మేనేజర్ తిరుపతయ్య అన్నారు. డిపోలో ట్రాఫిక్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఈ నెల 31వ తేదీ పదవీ విరమణ చేయనున్న ప్రసాద్‌కు శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు శివరాం, డిపో కార్యదర్శి నరసింహులు, డిపో అధ్యక్షుడు ఆచారి పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

సంజామల: మండలంలోని ఎన్ఆర్‌జీసీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీఓ ప్రకాశ్ రావు (అవుకు), ఈసీ నాగలక్ష్మి (బేతంచర్ల)తో పాటు ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్స్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎంపీడీఓ సాల్మన్ ఆధ్వర్యంలో బదిలీ అయిన ఉద్యోగులకు శుక్రవారం సన్మానం కార్యక్రమం నిర్వహించారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: డోన్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శీలం భాస్కర్ నాయుడు, కార్యదర్శిగా చిన్నమల్కాపురానికి చెందిన మద్దయ్య, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి రవి మోహన్, కోశాధికారి మంగమూరి శ్రీనివాసులు, మహిళా ప్రతినిధిగా కుమారిని ఎన్నుకున్నారు. నూతన కమిటీకి పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

రిటైర్డ్ డిప్యూటీ ఈఓ మృతి

డోన్: రిటైర్డ్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎస్ఎండీ హనీఫ్(97) శుక్రవారం ఉదయం మృతి చెందారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన మృతిపై ప్రభుత్వ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్, గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్ తదితరులు సంతాపం తెలిపారు.

డోన్ విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్: ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన నేషనల్ ఉడ్ బాల్ చాంపియన్‌షిప్‌లో ఏపీ నుంచి ప్రాతినిథ్యం వహించిన డోన్ విద్యార్థులు సత్తాచాటారు. పట్టణానికి చెందిన అజయ్, పారహన్, ధనుష్, మనోజ్, రంజిత్ జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. శుక్రవారం వారిని పాఠశాల యజమాన్యం అభినందించింది.

విద్యుత్ అదనపు లోడుకు 50 శాతం రాయితీ

డోన్ టౌన్: గృహ వినియోగదారులకు అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ నాగేంద్ర తెలిపారు. కిలోవాటుకు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2 వేలు చెల్లించాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం 50 శాతం రాయితీతో రూ.1,000 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎలాంటి మార్పు ఉండదన్నారు.

టీకా వేయించు..

పశువులను రక్షించు

- గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు
- ఇంకా మూడు రోజులే అవకాశం
- బనగానపల్లె నియోజకవర్గంలో 50,550 పశువులు



టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, ఏడీ మోహన్‌రావు (ఫైల్)

సంజామల: పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాడి రైతులు ముందస్తు టీకాలు చేయించి పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గాలికుంటు వ్యాధి పశువుల్లో తీవ్రంగా వ్యాప్తి చెందుతుంది. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద కేంద్ర ప్రభుత్వం పాడిరైతులకు ఉచితంగా టీకాలను అందిస్తోంది. మార్చి 31వ తేదీ వరకు అవకాశం ఉంటుందని.. మూడు రోజులే సమయం ఉండడంతో పాడిరైతులందరూ పశువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మోహన్‌రావు పేర్కొన్నారు.

వైరస్ రకాలు

పశువులకు గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల సోకుతుంది. ఇది అంటు వ్యాధి. గాలికుంటు వ్యాధిలో వైరస్ ఓఏసీ, ఆసియా-1, సాట్-1,2,3 అనే రకాలు ఉన్నాయి. ఒక పశువుకు వైరస్ సోకితే వేగంగా ఇతర పశువులకు వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి దేశవాళి పశువుల కంటే సంకర జాతీ పశువులకు వేగంగా వస్తుంది.

వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం ఉంటుంది. గేదెలు, ఆవులు, ఎద్దుల శరీర ఉష్ణోగ్రత 102, 106 డిగ్రీలకు పెరుగుతుంది. వ్యాధి వచ్చిన పశువులకు నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. నోటిలో బొబ్బలు పగిలి చొంగకారుతుంది. వైరస్ సోకితే ఆహారం సరిగ్గా తినలేవు. దీంతో పశువులు నీరసంగా ఉంటాయి. పొదుగుపై బొబ్బలు ఏర్పడుతాయి. గర్భధారణ కోల్పోతాయి. లక్షణాలు కనపడకముందే టీకాలు వేయించుకోవాలి. ఒకవేళ పశువులకు వ్యాధి సోకితే డాక్టర్ల సలహా మేరకు చికిత్స తీసుకోవాలి.

వ్యాధి ఎలా వస్తుంది?

పశువులకు గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల వస్తుంది. పరిసరాలు పరిశుభ్రం లేకున్నా వైరస్ వ్యాప్తి చెందుతుంది. వైరస్ క్రిములు పశువులకు నేరుగా తగలడం ద్వారా వస్తుంది. పశువులు తిన్న మేత ఇతర పశువులు తిన్నా వ్యాధి వ్యాప్తిచెందే అవకాశం ఉంది.

జాగ్రత్తలు.. నివారణ చర్యలు

- గాలికంటు వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరు చేయాలి.
- పశువుల పాకను 5 శాతం క్రెసాల్ కలిపి నీటితో శభ్రం చేయాలి.
- ముందస్తు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.
- వ్యాధితో మృతి చెందిన పశువుల కళేభరాలను లోతైన గొయ్యిలో పాతాలి లేదా కాల్చివేయాలి.
- వ్యాధి సోకిన పాలను దూడలు తాగితే ప్రాణపాయం ఉంటుంది.
- వ్యాధి సోకిన ఆంబోతులను సంపర్కానికి వినియోగించరాదు.
- పశువుల పాకను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి
- వ్యాధి మొదటి దశలోనే గుర్తించి డాక్టర్లను సంప్రదించాలి.

టీకాతో వ్యాధి నుంచి రక్ష



స్థానిక పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఈ నెల 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. వ్యాధి రాకముందే టీకా వేయించడం ఉత్తమం. టీకా వేసిన పశువుల్లో 3 వారల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఏటా టీకా వేయించడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ లభిస్తుంది. వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా చేయించాలి.

–డాక్టర్ మోహన్‌రావు, పశుసంవర్ధక శాఖ ఏడీ, సంజామల

బనగానపల్లె నియోజకవర్గంలో పశువుల వివరాలు

మండలం	ఆవులు, గేదెల సంఖ్య
బనగానపల్లె	9200
కోవెలకుంట్ల	15300
అవుకు	6400
కొలిమిగుండ్ల	7200
సంజామల	12450

రీసర్వేకు రైతుల సహకారం అవసరం



మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని వల్లంపాడు, పొట్టిపాడు గ్రామాల్లో రైతులతో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాల క్రితం భూముల సర్వే జరిగిందన్నారు. ప్రస్తుతం రీసర్వే చేయించుకోవడం వల్ల పొలాల హద్దులు, భూముల వివరాలను రికార్డుల్లో పకడ్బందీగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటరవి, సర్వేయర్ వీరన్న, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, వీఆర్‌ఓలు లక్ష్మయ్య, ఓబులేసు, పుల్లయ్య, లక్ష్మీనారాయణ, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించొద్దంటూ నిరసన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కోవెలకుంట్ల ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగలక్ష్మిని తొలగించవద్దని కూలీలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన సుమారు 500 మంది కూలీలు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఉపాధి పథకం ప్రారంభం నుంచి ఆమె ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తోందన్నారు. ఇటీవల రాజకీయ కక్షతో ఆమెను తొలగించి వేరొకరిని నియమించే కుట్ర జరుగుతోందని కూలీలు ఆరోపించారు. ఎలాంటి తప్పు చేయకున్నా ఆమెను ఎలా తొలగిస్తారని కూలీలు అధికారులను నిలదీశారు. అనంతరం ఎంపీడీఓ వరప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు

కోవెలకుంట్ల: ఈ నెల 30, 31వ తేదీల్లో రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కె. శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా రెండు రోజులు సెలవు అయినప్పటికీ 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ నెలాఖరుతో ముగియనున్న దృష్ట్యా ఆది, సోమవారాలను ప్రభుత్వం పని రోజులుగా ప్రకటించిందన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల ప్రజలకు భూములు, స్థలాలు, ఇళ్లు, తదితర ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఉగాది, రంజాన్ రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

బేతంచెర్ల: ఈ నెల 30వ తేదీ ఉగాది, 31న రంజాన్ సెలవులు ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సేవలు యాథావిధిగా కొనసాగుతాయని బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్ వనితా లక్ష్మి తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు, వ్యాపారులు గమనించాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సేవలు అందిస్తామన్నారు.

యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు

డోన్ టౌన్: ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ నెల 30, 31వ తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగలు ఉన్నా రిజిస్ట్రేషన్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని సబ్ రిజిస్ట్రార్ మహబూబ్‌బాషా తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాలో 20 మందికి ఉద్యోగాలు

డోన్ టౌన్: ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న న్యాక్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 20 మందికి ఉద్యోగాలు లభించినట్లు ట్రైనర్ మధుబాబు తెలిపారు. మొత్తం 38 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అమితి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, వెరిటాస్ ప్రైవేట్ ఫైనాన్స్ లిమిటెడ్, అమేజాన్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా 20 మందిని ఎంపిక చేశారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా

బనగానపల్లె రూరల్: సహారా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుమారు 70 పేద ముస్లిం కుటుంబాలకు రూ.500 నగదుతో పాటు 4 కేజీల బియ్యాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు ఎస్. షేక్షావలి, సెక్రటరీ అబ్బాస్ హుస్సేన్, సభ్యులు ఖాజాహుస్సేన్, అన్వర్, జిలాని బాషా పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి బీసీ మాట్లాడుతూ.. బనగానపల్లెలో పెన్షనర్ల సంఘం ఐకమత్యంగా ఉంటూ సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం బీసీ దంపతులతో పాటు సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శివనాగిరెడ్డి, సెక్రటరీ ప్రసాదరెడ్డి, పక్కిరారెడ్డి, శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ అంబాల రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఏపీఎంపై చర్యలకు వినతి

బనగానపల్లె రూరల్: వీఓఏలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులును విధుల నుంచి తొలగించి ఆయనపై చర్యలు తీసుకోవాలని వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి, ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మీ కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో ఏపీ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈఓ కరుణకు వినతిపత్రం అందజేశారు.

భగవన్నామ స్మరణ ముక్తికి సోపానం



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



గోమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: భగవన్నామ స్మరణ ముక్తికి సోపానమని, కలుషితాల నుంచి దూరం చేస్తుందని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. రాఘవరాజుపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో టీటీడీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు గోపూజ, కుంకుమార్చన, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన అలవర్చుకునేందుకు టీటీడీ గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పండుగలు, ఉత్సవాలను సంప్రదాయాల ప్రకారం జరుపుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికతతోనే మనసు ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. గీతా ప్రచారకులు జయదేవానందస్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ధర్మప్రచారకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాముడునాయక్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా సైనిక బోర్డు వెల్ఫేర్ అధికారి

బేతంచెర్ల: మాజీ సైనిక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు జిల్లా సైనిక బోర్డు వెల్ఫేర్ అధికారి రత్న రూతమ్మ, అసిస్టెంట్ అధికారి పుష్పలత తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పూదోట ఆశ్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమం సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్‌రెడ్డి, హెన్రీబాబు, ట్రెజరర్ మాబాష ఆధ్వర్యంలో మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ వంతు పరిష్కారానికి సహకారం అందిస్తామని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ మహేశ్వరమ్మ, మాజీ సైనిక ఉద్యోగులు వెంకటరమణ, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

అందరి ఆమోదంతో బేతంచెర్ల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: అందరి ఆమోదంతో నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని కమిషనర్ హరిప్రసాద్, చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు, చేపట్టాల్సిన పనులను కౌన్సిలర్లు విన్నవించారు. కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి డోన్ ఎమ్మెల్యే సహకారంతో రూ. 21 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల నివేదికను వినిపించారు. పట్టణంలోని ఆయా కాలనీల్లో పైప్‌లైన్ల ఏర్పాటుతో పాటు ఇంటింటికి కొళాయి కనెక్షన్ కోసం అమృత్ 2.0 పథకం కింద రూ.49.99 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వ ఆమోదం అవసరం అన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేందుకు రూ. 20 లక్షలు అవసరమని తెలిపారు. నగర పంచాయతీలో చేపట్టే అభివృద్ధి పనులు, వేతనాల చెల్లింపునకు వార్డు సభ్యుల అమోదంతో తీర్మాణం చేశారు. నగర పంచాయతీలో ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించి జూట్ బ్యాగులు వాడాలని కోరారు. ఇంటి పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, కౌన్సిలర్లు ఇబ్రహీం, చింతల నాగిరెడ్డి మధు, షేక్ ముబీనా, వెంగమ్మ, మహేశ్వరి, హుసేన్‌బీ, అబిదాబీ, కుమారి పాల్గొన్నారు.

డేంజర్ జోన్..!



కుందూనది వంతెన సమీపంలో ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు

పట్టణ శివారులోని కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో కుందూనది వంతెన వద్ద తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వంతెన దాటిన తర్వాత కుడిపక్కవైపు రహదారి ఆళ్లగడ్డ, ఎడమ వైపు రహదారి నంద్యాల వైపు వెళుతుంది. కోవెలకుంట్ల వైపు నుంచి వెళ్లే వాహనాలు ఎటు వైపు వెళుతాయో ఎదురుగా వచ్చే వాహనచోదకులకు తెలియని పరిస్థితి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడం, రోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రయాణికులు ఈ ప్రాంతంలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. వాహనాలు వేగంగా వస్తుండడంతో ఆ వాహనం ఆళ్లగడ్డ వైపు వెళుతుందా, నంద్యాలవైపు వెళుతుందా తెలియక ఎదురెదురు వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనాలు ఎటు వైపు వెళతాయో తెలియజేసేలా సిగ్నల్స్ అమర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. –కోవెలకుంట్ల



ప్రధాన రహదారి పక్కనే వాల్వ్ చుట్టూ మురుగునీరు

నీరు కలుషితం అయితే అంతే..!



నీరు లీకేజీ అయి పాచిపట్టిన వాల్వ్

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలో మంచినీటి సరఫరా అందించే క్రమంలో కొన్ని చోట్ల పైపులు లీకేజీ ఏర్పడి మురుగునీరు నిల్వ చేరుతున్నాయి. నీరు పైపులైన్‌లోకి కలుషితమైతే ప్రజలు చాలా ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. బస్టాప్ సమీపంలోని ప్రధాన రహదారిలోనే వాల్వ్ వద్ద నీళ్లు లీకేజీ కావడంతో చుట్టు మురుగునీరు, చెత్త చెదారంతో నిండిపోయింది. పొరపాటున మురుగు పైపుల్లోకి వెళితే ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో చోట ఉన్న వాల్వ్ నుంచి నీరు లీకేజీ అవుతూ పాచి పేరుకుపోయి పూర్తి అపరిశుభ్రంగా తయారైంది. పంచాయతీ అధికారులు స్పందించి వాల్వ్‌ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మాన్యం భూమిలో అక్రమ మైనింగ్



మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమిలో కొందరు అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. వివరాలు.. పలుకూరులో కిరణ్ అనే వ్యక్తి దేవదాయశాఖకు చెందిన సర్వే నంబర్ 308లో అక్రమ మైనింగ్ చేస్తుండడంతో ఆలయ అర్చకుడు భాస్కరయ్య, ఈఓ బ్రహ్మానందరెడ్డి వెళ్లి ప్రశ్నించారు. కిరణ్ వారితో వాగ్వాదానికి దిగడంతో బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి, నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యకు సమాచారం ఇచ్చారు. ఆధారాలతో స్టేషన్ వద్దకు రావాలని కిరణ్‌కు ఫోన్ చేశారు. ఎంతకి రాకపోవడంతో సీఐ, ఎస్‌ఐ, ఈఓ మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న అక్రమ మైనింగ్‌దారుడు అక్కడి నుంచి పారిపోయాడు. అనుమతి లేకుండానే మైనింగ్ చేస్తున్నట్లు స్థానికులు ఆరోపించారు. శివాలయానికి చెందిన సుమారు రూ.4 కోట్ల విలువైన మాన్యం భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

బేతంచెర్ల: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని షాదిఖానాలో ఉపవాసం ఉన్న ముస్లింలకు ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలకు ఆయనే భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో మండల ఖాజీ నూర్ అహ్మద్, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.